# నాలోని నేను

శ్రీవారినీ, పిల్లలనీ ఆఫీసుకీ, స్కూళ్ళకీ పంపించేసి, గబగబా ఇంటిపనులన్నీ పూర్తిచేసుకుని, క్రితం రోజు సగం రాసి వొదిలిపెట్టిన కథని పూర్తి చెయ్యటానికి కూర్చుంది బృంద.

అంతలోనే కాలింగ్‌బెల్ మోగింది. ఎప్పుడూ ఏదో డిస్టర్బెన్సీ. కాగితం కలం ముందేసుకుని కూర్చుందో లేదో, టెలిఫోన్ మోగింది. ఉస్సూరంటూ వెళ్ళి తీస్తే రాంగ్ నెంబరు. విసుక్కుంటూ రాంగ్ నెంబరు రంగనాథాన్ని తిట్టుకుంటూ వచ్చి, మళ్ళీ కాగితాల దగ్గర కూర్చుంది.

'అమ్మగోరూ!' తలుపు కొట్టింది గావుకేకలు పెడుతూ పనిమనిషి అనసూయ.

'ఏమిటబ్బా ఈ వేళప్పుడొచ్చింది. ఇప్పుడేగా పనిపూర్తి చేసి వెళ్ళింది. అనుకుంటూ లేచి వెళ్ళి తలుపు తీసింది బృంద.

'అమ్మగోరూ నేనింటికి పోయే సరికి మా చిన్నమ్మ కూతురు ఊరినుంచి వచ్చింది. రేపే వెళ్ళిపోతారంట. మధ్యాహ్నం ఆట సినిమాకు పోదామంటోంది. అందుకే ఏమన్నా పనుంటే సేసేసి పోదామని ఒచ్చేను' అంది. 'అంటే సాయంత్రం ఇంక రావా?' అడిగింది బృంద.

'ఎట్టా ఒత్తానమ్మా. సీనిమా అయిపోయే కాడికే ఆరు దాటుతది. ఇంటికెళ్ళేసరికి ఏడు. ఆల్లకేమన్నా సేసిపెట్టాల కదా!... ఇయ్యాలటికి రాను' అంది.

'ఇప్పుడేగా అన్ని పన్లూ చేశాం. ఇంకా నా భోజనం కూడా కాలేదు. గిన్నెలు కూడా లేవు తోమటానికి! సర్లే వెళ్ళు. రేప్పొద్దుటే వచ్చెయ్' అంది ఏడవలేక నవ్వుతూ బృంద.

అదెళ్ళిపోగానే తలుపు గడియపెట్టి వచ్చి కూర్చుంది బృంద. కలం పట్టుకుని ఆలోచిస్తోంది. తన కథలోని హీరోయిన్ శివప్రియని గురించి ఆలోచిస్తూ. శివప్రియ భర్త పాదాల కింద చరణదాసిలా పడుండే వ్యక్తి కాదు. ఆత్మగౌరవం కలది. ఆత్మ స్థైర్యం కలది. అందుకే తాగుబోతూ, తిరుగుబోతూ అయిన భర్తతో కాపురం చెయ్యనని ఖచ్చితంగా చెప్పి, బ్రతుకు తెరువు కోసం బయట పడుతుంది. శివప్రియ ఏ విధంగా సెటిలయింది వగైరాలు రాయవలసి వుంది. బృంద తీక్షణంగా ఆలోచిస్తోంది.

మళ్ళీ కాలింగ్‌బెల్ మోగింది. తన ఆలోచనలకి అంతరాయం కలిగిస్తున్నదెవరో తిట్టుకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

'బృందగారు మీరేనా?' అడిగింది ఆమె.

'అవును! మీరెవరూ?' అడిగేలోగానే, లోపలికొచ్చేసి కుర్చీలో కూర్చుంది. 'క్షమించండి కూర్చుంటున్నందుకు' అంటూ. ఎవరీవిడ? స్నేహితురాలా - కాదు. బంధువా... ఎప్పుడూ చూడలేదు. ఎంతో చొరవగా ఒచ్చేసి అలా కూర్చోవటం ఎబ్బెట్టుగా అనిపించింది. ఆమె చేతలో ఒక ప్లాస్టిక్ బుట్ట మాత్రమే వుంది. అందుకని ఊరి నుంచొచ్చిన వ్యక్తి కాదు అనుకుంటూ... 'మీరు...'

అడిగే లోపలే ఆమె ఏడుపు లంకించుకుంది.

కంగారుగా 'ఎవరమ్మా నువ్వు? ఎందుకేడుస్తున్నావ్?' అడిగింది బృంద.

'మీరు స్త్రీల సమస్యల గురించి అనేక కథలూ, వ్యాసాలు రాశారు. మొన్నీ మధ్యనే ఒక దినపత్రికలో మీ గురించి చదివి నా జీవితానికి పరిష్కారం సూచిస్తారనే ఆశతో, మీ అడ్రసు వెతుక్కుంటూ కొండంత ఆశతో వచ్చాను' చెప్పటం ఆపి వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆమె.

బృంద ఆమెకేసి పరిశీలనగా చూసింది. వయస్సు నలభై దాటి వుండదు. మనిషి ఎఱ్ఱగా బుఱ్ఱగా పెద్ద అందంగా కాకపోయినా ఆకర్షణీయంగానే ఉంది. వెంటనే ఏమడగాలో తెలీక ' ఏడవకండి ఊరుకోండి. మీ సమస్యేమిటే చెప్పండి' అంది ఆమెని ఊరడించే ప్రయత్నం చేస్తూ బృంద. ఆమె కళ్ళు తుడుచుకుని బృందకేసి చూసింది.

'నేను ఇల్లు విడిచి వచ్చేశాను. మీరేదైనా దారి చూపిస్తే నా బతుకు నేను బతుకుతాను. మిషన్ కుడతాను. బుట్టలల్లుతాను. ఏ ఊడిగమైనా చేస్తాను. ఆయనతో సంసారం తప్ప' మళ్ళీ ఏడ్చింది.

'మీ ఆయనేం చేస్తారు?'

'ఇక్కడ రిఫ్రిజిరేటర్స్ కంపెనీలో ఇంజనీరు' ఖంగు తింది బృంద.

అంత మంచి చదువు, హోదా ఉన్న ఉద్యోగం. 'ఏవో చిన్న గొడవలు జరిగుంటాయి. ఆవేశంలో ఈవిడ ఈ నిర్ణయం తీసుకుని వచ్చేసుండవచ్చు. మాటల్లో పెట్టి, ముందు ఆమె ఆవేశపు పొంగు చల్లార్చాలి' అనుకుంది బృంద.

'మీకు పిల్లలున్నారా?'

'ఆఁ ఒకమ్మాయి, ఒకబ్బాయి.' 'అమ్మాయి పదో క్లాసు, అబ్బాయి ఎనిమిదో క్లాసు.'

'అంటే..... పెద్దవాళ్ళే.'

'ఆఁ... !'

'మరయితే... ఎందుకు ఇల్లొదిలి వచ్చేశారు?'

'అతను కొట్టే దెబ్బలూ పెట్టే హింసలూ భరించలేక' మళ్ళీ ఏడ్చింది ఆవిడ.

'మీ పెళ్ళయి ఎన్నేళ్ళయింది?'

'ఇరవై ఏళ్ళు!'

'అప్పుడంతా బాగానే ఉండేవారా?'

'లేదు. ఈ శరీరం ఇరవై ఏళ్ళనుంచి దెబ్బలతో కమిలిపోయింది. దెబ్బ తగలని చోటు లేదు. అతనికి కోపం ఎందుకొస్తుందో, ఎప్పుడొస్తుందో తెలీదు. అసలా కోపానికి అర్థం లేదు. వంకాయ కూర చెయ్యమంటారు. చేస్తే ఎందుకు వంకాయ కూర చేశావని కొడతారు. కూరంతా నా మొహానికి పూసి. నా ఏడుపు, అరుపులూ వినబడకుండా రేడియో సౌండ్ పెద్దది చేసి పెట్టి, చేతిలో ఏదుంటే అది పెట్టి కొడతారు. ఎవరైనా ఆ దెబ్బలేమిటని అడిగితే, పడ్డానని చెప్పాలి. డాక్టరు దగ్గరికెళ్ళి మందులు తెచ్చుకోమంటారు. తను కూడా వస్తారు. డాక్టరుకి పడ్డాననో, ఏదో తగిలిందనో చెప్పాలి. డాక్టరు ఎన్నోసార్లు 'అలా ఎలా పడతావమ్మా చిన్నపిల్లలాగా' అని ఎగతాళి చేశారు. నేనేం చెప్పాలి చెప్పండి' మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమెను ఓదారుస్తూ మంచి నీళ్ళు తెచ్చి అందించింది బృంద. గడగడా నీళ్ళు తాగేసి గ్లాసు పక్కన పెట్టింది ఆమె.

ఇద్దరి మధ్యా పదినిమిషాలు నిశ్శబ్దం చోటు చేసుకుంది.

బృంద ఆమెనే పరికించి చూసింది. ఎక్కడా ఆమె అబద్ధం చెప్తున్నట్టు అనిపించలేదు.

'మీ ఆయనకి ఈ పెళ్ళి ఇష్టం లేదా?' అడిగింది.

'అలా ఏమీ ఎప్పుడూ అనలేదు.'

'కట్న కానుకలు చాలవని సాధిస్తాడా?'

'తెలీదు. కోపం వచ్చినప్పుడల్లా, కొట్టి కొట్టి. 'సిగ్గుంటే ఎక్కడికైనా వెళ్ళిపో' అని తిడతారు ఇష్టం వచ్చినట్లు' కళ్ళు వత్తుకుంది.

'అమ్మా... నాన్నా... అన్నా... తమ్ముడూ, అక్కచెల్లెళ్ళు ఎవ్వరూ లేరా నీకు?' అడిగింది బృంద కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

'ఉన్నారు. నాన్నగారు రైల్వేలో ఉద్యోగం చేసి రిటైర్ అయిపోయారు. ఒక అన్నా, ఒక తమ్ముడూ వున్నారు. అక్క చెల్లెళ్ళు లేరు. వదినా, మరదలూ నా బాధలు తెలిసినా

సానుభూతి చూపించరు. అన్నయ్యా, తమ్ముడూ 'మగవాడేం చేసినా నువ్వే భరించాలి' అని ఖచ్చితంగా చెప్తారు.

అమ్మా, నాన్నా చాటుగుండా ఓదార్చినా, నా స్థానం మాత్రం వాళ్ళ దగ్గర లేదని అతని పాదాల దగ్గరేనని కొట్టినా చంపినా అక్కడే పడుండాలని అంటారు. పైగా వారికి నేనొక్కర్తినే ఆడపిల్లని కావడం వల్ల, బాధనంతా గుండెల్లోనే దాచుకుని, పరువుకోసం నన్ను పతిదేవుడి దగ్గరే వుండమని మరీ మరీ చెబుతారు. మళ్ళీ ఏడుపు.

'అది సరే కనీసం, మీ వారితో మాట్లాడి సంగతులు కనుక్కోరా?'

ఏడుపాపి, 'చాలాసార్లు కనుక్కున్నారు. మా ఆయన వాళ్ళ ముందు చాలా చక్కగా నటిస్తారు. తప్పంతా నాదేనన్నట్లు చిత్రిస్తారు. అంతే వాళ్ళటూ, నేనిటూ, ఆ తరువాత దెబ్బలు రెట్టింపు' పమిట కొంగుతో ముఖం కప్పుకుని ఏడుస్తూన్న ఆమెని చూస్తూ వుంటే బృంద మనసు కరిగిపోయింది.

'మరైతే ఇప్పుడేం చేద్దామని?' పిచ్చిగా అంది.

'మీరే చెప్పాలి. నాకేదైనా పనిప్పించండి. ఎక్కడైనా తలదాచుకుంటానికి కాస్త దారి చూపించండి. మీరు స్త్రీల సమస్యల పట్ల రాసిన అనేక కథలే, కథల్లో మీరు చూపిన పరిష్కారాలే నన్ను చావనీయకుండా చేశాయి. మీ అడ్రసు వెతుక్కుంటూ మీమీదే ఆశలు పెట్టుకుని వచ్చాను. నిజానికి నాకు ఏ బస్సు ఎక్కడెక్కాలో తెలీదు. ఎప్పుడో తప్ప రోడ్డు చూసే అవకాశమే లేదు నాకు. మా బంధువుల్లో గానీ స్నేహితుల్లోగానీ ఏ శుభకార్యానికి పిలిచినా ఆయనొక్కరే వెళ్తారు. నేను పనుండి రాలేకపోయాననో, ఒంట్లో బాగులేదనో వాళ్ళకి చెప్తారు, నన్నూ కలిస్తే అలాగే చెప్పమంటారు. అందుకే వాళ్ళందరూ నా గురించి అదోలా మాట్లాడుతారు. 'గర్వం అనీ, ఒంటి పిల్లి రాకాసిననీ ఏదేదో అంటారు. అందుకే నాకు ఏ చుట్టాల దగ్గరికీ వెళ్ళాలని లేదు. వెళ్ళను గాక వెళ్ళను' అంది దృఢ నిశ్చయంతో, 'గదిలో బంధించి కొడితే పిల్లికూడా పులిలాగే పంజా విప్పుతుందంటారు. ఇదేనేమో ఇరవై ఏళ్ళ చిత్రవధ ఆమె మనసును రాయిని చేసింది' అనుకుంది బృంద.

'మరి పిల్లల సంగతేమిటి?' అంది.

'నేను పోతే వాళ్ళనైనా జాలితో చేరదీస్తారులెండి, మా అమ్మా నాన్నా...'

'మరి ఆయన పిల్లలనైనా ప్రేమగా చూస్తాడా?'

'లేదు... వాళ్ళదీ నా గతే! అతనంటే వణికిపోతారు' అంది నేల చూపులు చూస్తూ. బృంద మనసు బరువెక్కిపోయింది. 'చూడమ్మా! తండ్రి దగ్గర చనువులేదు. తల్లి కూడా కనబడకుండా పోతే... మరి... ఎలాగా! వాళ్ళకోసమైనా నువ్వు ఇంటికి వెళ్ళాలి' అంది.

తలెత్తి ఆమె బృంద కళ్ళలోకి చూసింది.

ఆ చూపులు తూటాల్లా తాకాయి బృందకి.

'మీరు కూడా అందరిలాగే మామూలు మాటలు చెబుతున్నారా? మీరు రాసే కథలూ కథల్లో ఇచ్చే పరిష్కారాన్ని చూపించలేని మీరు, లేని పోని ఆశలు, కల్పించి కథలెందుకు రాస్తారు?' అన్నట్లున్నాయి ఆ చూపులు! మనసులో జరుగుతున్న సంఘర్షణకి మాటలు గొంతు దాటి రావటం లేదు బృందకి.

'పోనీ ఈమెని తనింట్లోనే వుంచుకుంటే? ఏదో ఒక ఉపాధి కల్పించేంత వరకైనా తనే వుంచుకుంటే? కానీ, ఈమె చెప్పేవన్నీ నిజాలో కావో ఎలా తెలుస్తుంది? ఒకవేళ ఈమె వ్యక్తిత్వం మంచిది కాక అతడి ప్రవర్తన బాగులేదని చెబుతుందేమో! ఆమె భర్తకి గానీ, తల్లిదండ్రులకు గానీ ఆమె ఇక్కడుంటున్నట్టు తెలిసి, వాళ్ళు తన ఇంటిమీద పడితే? శ్రీవారూ, పిల్లలూ తననేమంటారో?' జవాబు దొరకని ప్రశ్నలతో అలిసిపోయి మూగగా కూర్చుంది బృంద.

సాధారణంగా బృంద రాసే ప్రతీ కథా చదివి ఉత్తేజితురాలై చక్కటి కామెంటు చేస్తుంది మహిత. మహిత ఎదురింట్లో వుంటుంది. ఎమ్.ఏ. చదివింది. భర్త బ్యాంకులో ఆఫీసరు. ఇద్దరు పిల్లలు. చింతల్లేని చిన్న సంసారం వాళ్ళది. మహితతో కబుర్లు చెప్పడం బృందకి కూడా ఇష్టమే.

'రా మహితా! సమయానికొచ్చావు' అంటూ మహితని పరిచయం చేసింది ఆమెకి.

'ఆమె పేరు చెప్పలేదు' అంది మహిత ఆమెని చూస్తూ అంతదాకా ఆమె పేరు కూడా బృంద అడగనందుకు సిగ్గుపడింది.

'నా పేరు మీరా' అంది ఆమె.

బృంద ఆమె కథంతా చెప్పింది మహితకి.

మహిత కూడా ఆలోచనల్లో మునిగిపోయింది! అన్నింటికీ స్పందించి అనర్గళంగా మాట్లాడే మహిత కూడా మూగగా చూస్తోంది దిక్కుతోచక! మీరా ఆశగా మహిత కేసి బృందకేసి చూస్తోంది. కాలం ముగ్గురి మధ్యా స్థంభించిపోయింది. 'మీ పిల్లల కోసమైనా మీరు తిరిగి ఇంటికివెళ్ళాలి. వారి భవిష్యత్తు కోసమైనా మీరు బాధలన్నీ భరించాలి. పైగా ఇరవై ఏళ్ళు భరించగా లేనిది మరో రెండేళ్ళు భరిస్తే పోలా...' ఈ మాటలే చెవుల్లో రింగుమంటున్నాయి.

బృందకేసి చూసింది. ఆమె ఆ మాటల్నే తన నోటితో చెప్పింది. ఏహ్యాభావం! మీరేనా చెప్పేవాళ్ళు! చేతికొచ్చినది మీరు రాస్తున్నారు, నోటికొచ్చిది ఆమె చెప్పింది. మీ మాటల్లో, మీ రాతల్లో నిజాయితీ లేదు. మీరు ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పడం తప్ప ఏమీ చెయ్యలేరు అన్నట్టున్నాయి ఆ చూపులు! శూలాల్లా గుచ్చుకున్నాయి. బృంద గుండెల్లో ఆ చూపులు.

ఆమె 'వస్తా' అంటూ గిరుక్కున తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయినా ఆమె ఆలోచనలు బృంద మస్తిష్కంలో కదులుతూనే ఉన్నాయి. ఆ మర్నాడు 'హుస్సేన్‌సాగర్‌లో తేలిన మహిళ శవం' అనే శీర్షికని పేపర్లో చూసి, తనే ఒక హంతకురాలిగా ఫీలయింది బృంద. తన మీద తనకే వళ్ళు మండిపోయింది. తన చేత పెద్ద పెద్ద నీతులు చెబుతూ రాయించిన రచయిత్రిని కసితీరా తిట్టుకుంది.

వారం రోజులు గడిచిపోయాయి. ఆ రోజు తలంటుకున్న జుట్టుని ఆరబెట్టుకుంటూ వసారాలోని వాలుకుర్చీలో కూర్చునుంది బృంద. అల్లంత దూరాన్నుంచి అనసూయ కనిపించింది. అనసూయ పక్కనే కబుర్లు చెబుతూ వస్తున్న ఆమెని తీవ్రంగా చూసింది. అవును ఆమే! మీరా! ఆనందంతో లేచి నుంచొంది.

'పాపం! ఈయమ్మగోరు బస్టాండు కాడ దిగాలు పడి కూచుంది. మేము సినిమా కాడి నుండి వొత్తావుంటే ఈమెని సూసి, ఇవరాలడిగాము. తన గోడంతా సెప్పింది. మా ఇంటాయనికి సెప్పి ఒప్పించి, మా ఇంట్లోనే వుంచుకున్నాం. మాతోపాటే, కలో గంజో తాగుతూ వుంది. ఈ వారం రోజుల్నుంచి మా ఇంటాయన, మా ఇంటిముందే ఒక సెడ్డేసి, కూరగాయల దుకాణం పెట్టించిండు. రోజుకు పదిఏనూ, ఇరవైదాకా ఒత్తున్నాయి. ఈమె అదురుట్టం! మా ఇంటి ఎదురింట్లో ఒక గది ఖాళీ అయింది. నెలకి అరవై రూపాయలద్దె. ఈయమ్మని అందులో వుంచేము. మీకీ ఇసయాలు సెబితే స్త్రీ కథలు రాసే మీరు ఎంతో సంతోషిస్తారని ఎదురుసూత్తున్నా. పాడు జెరంతో పదిరోజుల్నుంచి పనిలోకే రాలేదు కదా!' అంది అనసూయ.

బృందలోని రచయిత్రిని ఎవరో కొట్టినట్టనిపించింది మళ్ళీ! సిగ్గుతో మాట్లాడలేక మీరానే చూస్తూ వుండిపోయింది.

'అవునండీ! మా పిల్లల్ని నేననుకున్నట్టుగానే, మా అమ్మా వాళ్ళు తీసుకెళ్ళారట. ఆయన ఈ వూరి నుంచి మధురైకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారట. అడ్రసిచ్చి పంపితే, అనసూయ భర్త ఈ సమాచారం సేకరించి పెట్టాడు' అంది.

బృంద తను చెయ్యలేని పని చదువూ సంధ్యాలేని పనిమనిషి అనసూయ, ఆమె భర్త చేసి చూపించారు. మళ్ళీ తనలోని రచయిత్రి సిగ్గుతో కుంచించుకు పోయింది.

'రచయిత్రీ! నీకు జోహార్లు!!' అనుకుంది. తనలోని రచయిత్రిని కసిగా చూస్తూ బృంద.

నేను మీలాగా చదువుకున్న దానినికాను. కానీ మీ రచనలు చదివి, సమస్యలకు మీరిచ్చే పరిష్కారాన్ని అర్థం చేసుకుని, ఎట్టి పరిస్థితిలోనూ, సమస్యలకి చావు పరిష్కారం కాదు, అని తెలుసుకున్నాను. ఆ బోధనలే నాలోని ఆశని చావకుండా చేశాయి. నా కాళ్ళమీద నేను నా స్వశక్తితో నుంచునే ధైర్యాన్నిచ్చాయి. మీలాంటివారి సందేశాలు సంజీవనిలా పనిచేస్తాయి. భగవంతుడు మిమ్మల్ని చల్లగా చూడాలి' అంది మీరా.

ఆమెలోని ప్రతీమాటకీ బృంద స్పందించిపోయింది. ఆమె కళ్ళవెంట నీళ్ళు చెంపలమీదుగా ముత్యాల్లా రాలాయి. ఆమెలోని రచయిత్రి తృప్తిగా తలెత్తి చూసింది. కలంతోనూ మీరు చేస్తున్న సేవా గొప్పదే అంటూ.

కాస్సేపు కూర్చుని కాఫీ తాగి మీరా వెళ్ళిపోయింది. పని పూర్తి చేసుకుని, అనసూయ వెళ్ళిపోయింది. కాగితాలు ముందేసుకుని తనలోని రచయిత్రికి నమస్కరిస్తూ కలం పట్టింది. భావతరంగాలతో పోటీపడుతూ అక్షరాలు పరుగెడుతున్నాయి.

* * *